క్లుప్తంగా

అభివృద్ధిపై దృష్టి సారించాలి



కత్తిపూడి సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ట్రైనీ కలెక్టర్ ప్రఖర్ జైన్

శంఖవరం: గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది, అధికారులు అభివృద్ధిపై దృష్టి సారించాలని ట్రైనీ కలెక్టర్ ప్రఖర్‌జైన్ సూచించారు. మండలంలోని కత్తిపూడి గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. డ్రైనేజీలో మురుగు నీరు, చెత్త చెదారం లేకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. రాత్రి వేళల్లో వీధి లైట్లు వెలిగేలా చూడాలన్నారు. నాడు–నేడు పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

స్వరూపానందేంద్ర స్వామిజీని కలిసిన ఎమ్మెల్యే పర్వత



విశాఖపట్నంలో స్వామీజీ ఆశీస్సులు పొందుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం/అన్నవరం: విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామిజీని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ శనివారం కలిశారు. విశాఖ పట్నంలోని శ్రీశారదా పీఠంలో స్వామిజీని కలిసి ఆశీస్సులు పొందారు. తొలుత ఆయన పీఠంలోని శ్రీరాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఛాతుర్మాస దీక్ష కోసం స్వరూపానంద సరస్వతీ స్వామీజీ, చిన్నస్వామీజీ, స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామీజీ తన శిష్యబృందంతో ఈ నెల 21న ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు వెళుతున్నందున మర్యాదపూర్వకంగా వారిని కలిసినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువకుడితో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రామారావు

ప్రత్తిపాడు: ఒకరు రక్తదానం చేస్తే ముగ్గురికి ప్రాణదానం చేసినట్టు అని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వైడి రామారావు అన్నారు. ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడి సగరుల రామాలయం వద్ద నియోజకవర్గ బీసీ ఐక్య సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని సగర సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఏపూరి సత్యనారాయణ ప్రారంభించారు. సుమారు 110 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రామారావు మాట్లాడుతూ వేసవి తీవ్రత వల్ల రాష్ట్రంలోని బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు తగ్గాయన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 150 మంది చిన్నారులు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని, వారందరికీ రక్తం ఎంతో అవసరమన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రతి మంగళ, శుక్ర వారాల్లో 1,300 యూనిట్ల రక్తం ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. చినశంకర్లపూడి వంటి మారుమూల గ్రామంలో రక్తదానం చేసేందుకు భారీ ఎత్తున యువత తరలిరావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) కేంద్ర కమిటీ సభ్యుడు బుగత శివ, గ్రామ మాజీ సర్పంచ్ గొల్లపల్లి అమలావతి, న్యాయవాది పైలా బోస్, జిల్లా యాదవ సంఘ నాయకులు నైదాన రఘు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన వేమన సుబ్బలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం నుంచి రూ.లక్ష మంజూరైంది. ఆ చెక్కును శనివారం స్థానిక సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, పార్టీ నేత రామిశెట్టి బులిరామకృష్ణ మృతురాలి కోడలు వేమన హేమకు అందజేశారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన

ఏలేశ్వరం: మనబడి నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని తిరుమాలి ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం యర్రవరంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీపీ పరిశీలించారు. ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఆరోగ్యమస్తు

- వైద్య విధానంలో విప్లవాత్మక మార్పులు
- మండలానికి రెండు పీహెచ్‌సీలు
- అందుబాటులో మందులు, మౌలిక వసతులు
- ఇంటి ముంగిటకే వైద్య సేవలు



నాడు: కోటనందూరు పీహెచ్‌సీలో టార్చ్‌లైట్ల వెలుగులో వైద్యం చేస్తున్న వైద్య సిబ్బంది



నేడు: రోగుల ఇంటి వద్దే వైద్యం చేస్తున్న వైద్యాధికారి ఇందిరాప్రియదర్శిని

కోటనందూరు: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. దీనిలో భాగంగానే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య విధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. మండలంలోని రెండు పీహెచ్‌సీలు ఉండేలా చర్యలు తీసుకొని అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి సగటు పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. పీహెచ్‌సీల్లో అన్ని రకాల మందులు, రక్త పరీక్షలతో పాటు 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచి ప్రజలకు వైద్య సేవలను చేరువ చేస్తున్నారు. గడిచిన సంవత్సర కాలంలో కోటనందూరు పీహెచ్‌సీలో 100కు పైగా ప్రసవాలు జరిగాయంటే ఇక్కడ అందిస్తున్న వైద్య సేవలను ఇట్టే అంచనా వేయవచ్చు.

నాడు కష్టాలు.. నేడు ఇంటి మెరుగైన సేవలు

గతంలో పేదవాడికి ప్రభుత్వ వైద్యం గగనంగా ఉండేది. దశాబ్దాల పాటు వైద్య సిబ్బంది కొరత పీహెచ్‌సీని వేధించేది. ఆసుపత్రి ఒక్కపూటే పని చేసే దయనీయ పరిస్థితి ఉండేది. 108, 104 వాహనాలు అందుబాటులో లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారు. నేడు పరిస్థితి పూర్తిగా మారింది. ప్రస్తుతం మండలంలో కోటనందూరు, పాతకొట్టాం పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. రెండు పీహెచ్‌సీల్లో ఇద్దరేసి



అన్ని వసతులతో కూడిన కోటనందూరు పీహెచ్‌సీ

డాక్టర్లతో పాటు అవసరం మేర వైద్య సిబ్బందిని నియమించారు. మండల వ్యాప్తంగా పారామెడికల్ వైద్య సిబ్బంది సైతం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నారు. మండలానికి 108, 104 వాహనాలు కేటాయించి 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉంచారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

పల్లెల్లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వైద్యులతో పాటు వైద్య సిబ్బంది నేరుగా ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో ప్రయాణ ఖర్చులతో పాటు ఇతర ప్రాంతాలకు తిరిగే ఇబ్బంది తప్పిందని పల్లె ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంచానికి పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులు, ఆరోగ్యశ్రీ రోగులను పరామర్శిస్తూ ఇంటి ముంగిటే వైద్య సేవలు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు.

వృద్ధులకు ఇంటి వద్దే వైద్య సేవలు



నా పేరు కామిరెడ్డి సత్యన్నారాయణ. వయస్సు 62 సంవత్సరాలు. మాది కోటనందూరు మండలం బిళ్లనందూరు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న నేను వయస్సు మీదపడడంతో దూరంగా వెళ్లి ఆసుపత్రిలో చూపించుకోవడం ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు వైద్య సిబ్బంది నేరుగా ఇంటికే వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. మాలాంటి వృద్ధులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– కామిరెడ్డి సత్యనారాయణ, బిళ్లనందూరు

అందుబాటులో మందులు



రెండు పీహెచ్‌సీల్లో గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. కుక్కకాటు, పాముకాటుతో సహా అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఆపరేషన్ థియేటర్‌తో పాటు అన్ని విభాగాల్లో విద్యుత్ వెలుగులు, ఇతర వసతులకు ఇబ్బంది లేదు. రోగులకు అందుబాటులో ఉండి 24 గంటలూ వైద్య సేవలు అందిస్తున్నాం. కోటనందూరు పీహెచ్‌సీకి వచ్చే గర్భిణులు, రోగుల సౌకర్యార్థం స్థానిక ప్రజాప్రతినిధుల తోడ్పాటుతో షెల్టర్ నిర్మాణం, ఫ్యాన్లు ఏర్పాటు చేశాం. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించి రోగులకు ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ ఇందిరాప్రియదర్శిని, వైద్యాధికారి, కోటనందూరు

జగనన్న పాల వెల్లువతో రైతులకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేశ్వరరావు

కిర్లంపూడి: జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాడి పశువుల గుర్తింపు కోసం చేస్తున్న పాలవెల్లువ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సర్వే ఆధారంగా ప్రతి గ్రామంలోనూ పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి పాడి రైతులకు మదతు ధర లీటర్‌కు రూ.80 ఇచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు

గండేపల్లి: ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన గుడుమానికల వెంకటరమణ ఈ నెల 12న తన మోటార్ సైకిల్‌పై గ్రామ శివారులో ఉన్న పొలంలోకి కూలీ పని నిమిత్తం వెళ్లాడు. పొలం పని చేస్తుండగా కొద్ది సేపటికి పార్కింగ్ చేసిన స్థలంలో తన మోటార్ సైకిల్ కనబడకపోవడంతో పలు చోట్ల వెతికాడు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



తుని 6వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాజా

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- తునిలో గడపగడపకూ మన ప్రభుత్వం

తుని: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని 6వ వార్డులో కౌన్సిలర్ సూరిశెట్టి సుభద్రాదేవి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంత్రి రాజా పాల్గొన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల కోసం పని చేస్తున్న ప్రభుత్వానికి మీ అందరి ఆశీస్సులు కావాలని కోరారు. అమ్మాజీపేట మెయిన్ రోడ్డు నుంచి చెక్కల మార్కెట్ వరకూ రోడ్డు శిథిలావస్థకు చేరిందని పలువురు మహిళలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ప్రసాదరాజును మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు చెబుతున్న మాయమాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. గడగపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, పార్టీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాముర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, తుని పట్టణశాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు సాపిరెడ్డి శేషమణి, పోతుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో బహుళ ప్రయోజనాలు

కోటనందూరు: భూసార పరీక్షలతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని మండల వ్యవసాయాధికారి కె.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కేఏ మల్లవరం, పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం గ్రామాల్లో మట్టి నమూనాల సేకరణను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ సేకరించిన మట్టి నమూనా పరీక్షల అనంతరం ఖచ్చితమైన ఫలితాలను రైతులకు తెలియజేస్తామన్నారు. భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు, పురుగుమందుల యాజమాన్యాన్ని పాటిస్తే ఆరోగ్యవంతమైన దిగుబడులు వస్తాయన్నారు. మండలంలోని 13 ఆర్బీకేల పరిధిలో 102 మట్టి నమూనాలు సేకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించేందుకే జగనన్న సురక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మజ్యోతి

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించేందుకే జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టినట్టు ఎంపీడీఓ పద్మజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు తెలిపారు. గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జగనన్న సురక్ష పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి జూలై 23 వరకూ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు పొందడంలో తలెత్తే సమస్యలను పరిష్కరించి అర్హులకు పథకాలు అందేలా చూస్తారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, తోలేటి రాంప్రసాద్, ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ధర్మవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



ధర్మవరంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ధర్మవరంలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, సొసైటీ చైర్మన్ చెక్కపల్లి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బెంతుకుర్తి అబ్బాయి, జువ్వల బాబులు, నానిపల్లి చంటి తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, ఎంపీపీ గోళ్ల కాంతిసుధాకర్, పార్టీ నాయకులు బొల్లు తాతాజీ, కుప్పిన శ్రీను, రాపా గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



సత్యదేవుని సన్నిధిలో కమలానంద స్వామీజీ, చిత్రంలో ఈఓ చంద్రశేఖర అజాద్

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రధానాలయానికి చేర్చారు.

సత్యదేవుని దర్శించిన కమలానంద స్వామీజీ

గన్నవరానికి చెందిన హిందూ దేవాలయ పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు, భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి శనివారం సాయంత్రం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. స్వామీజీకి ఆలయం వద్ద పండితులు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ చంద్రశేఖర్ అజాద్ బహూకరించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

అన్నవరం: స్థానిక సత్యదేవ డిగ్రీ కళాశాల సమీపంలో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కోళ్ల అప్పలనర్సకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. కాగా శనివారం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి అన్నివిధాలా సహాయసహకారాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట శంఖవరం వైస్ ఎంపీపీ ధారా వేంకటరమణ, అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమారరాజా, ఉపసర్పంచ్ వెంకన్నబాబు తదితరులు ఉన్నారు.

విద్యాకానుక యుద్ధప్రాతిపదికన అందించాలి



జేవీకే స్టాక్ పాయింట్‌లో విద్యార్థుల యూనిఫాం నాణ్యతను పరిశీలిస్తున్న సీఎంఓ నాగేశ్వరరావు

తొండంగి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను యుద్ధప్రాతిపదికన అందించాలని విద్యాశాఖ సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని జేవీకే పాయింట్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు వచ్చిన యూనిఫాం నాణ్యతను పరిశీలించారు. మండలడంలో ఇప్పటివరకూ 3483 మంది విద్యార్థినులకు యూనిఫాం వచ్చాయని ఎంఈవో షేక్‌బాబ్జి వివరించారు. స్కూల్ బ్యాగ్స్ కూడా మరో రెండు రోజుల్లో వస్తాయన్నారు. సెంట్రల్ స్టాక్ పాయింట్ నుంచి మండల స్టాక్ పాయింట్‌కు రాగానే అన్ని పాఠశాలలకు వాటిని పంపించి విద్యార్థులకు పంపిణీ చేయాలని నాగేశ్వరరావు అధికారులకు ఆదేశించారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు ప్రతాప్‌రెడ్డి, శీలా, ఐఈఆర్‌టీ వలంటీర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం



ఏలేశ్వరంలో విద్యార్థులను సత్కరిస్తున్న కౌన్సిలర్ హైమావతి, వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం జనగన్న అణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్‌తో కలిసి ఆమె సత్కరించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ సతివాడ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నేత కోరాడ ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, పిండిశివ తదితరులు పాల్గొన్నారు.

జననన్న ఆణిముత్యాలకు అభినందనలు



కాకినాడలో సాయిదుర్గను అభినందిస్తున్న ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



ములగపూడిలో విద్యార్థులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ చినదివాణం



కోటనందూరులో విద్యార్థికి ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు



వి.కొత్తూరు కేజీబీవీలో విద్యార్థినులను నగదు, ప్రశంసా పత్రాలతో అభినందిస్తున్న నాయకులు

శంఖవరం: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో స్థానిక ఆదర్శ, కేజీబీవీ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆదర్శ కళాశాలకు చెందిన గవరసాని గంగాభవాని, ఏలూరి రమా అంజలి ఎంపీసీలో 951 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారు. కేజీబీవీ పాఠశాలకు చెందిన కొత్తాడ సాయిదుర్గ 789 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా శనివారం వీరిని కాకినాడలో ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా అభినందించి నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రతి విద్యార్థి జగనన్న ఆణిముత్యం కావాలి

రౌతులపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి జగనన్న ఆణిముత్యం కావాలని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం సూచించారు. మండలంలోని ములగపూడి, లచ్చిరెడ్డి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించి నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, పార్టీ నేత రామిశెట్టి బులిరామకృష్ణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోరిగంటి వెంకన్న ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహం అందజేశారు. సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దుంగల నాగేశ్వరావు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ అమృతవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, విద్యాకమిటీ చైర్మన్ కణితి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పోతుల నాని, దొడ్డి బేబీ, అప్పికొండ గంగాభవాని ఆరుగుల కన్నియ్యలకు అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యుడు దోశ చిట్టిబాబు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతిని అందజేశారు.

విద్యకు పెద్దపీట

కోటనందూరు: ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని కోటనందూరు, భీమవరపుకోట హైస్కూళ్లలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదోతరగతి పరీక్షల్లో కోటనందూరు హైస్కూల్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన గంటా తులసీ, కీర్తి వర్ధన్, సామిరెడ్డి శ్రీజ, భీమవరపుకోట హైస్కూల్ నుంచి తొలి మూడు స్థానాలు సాధించిన వై.భావన, వై.జశ్వంత్, పి.శిరీషలను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. సర్పంచ్ జిగటాల వీరబాబు, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి కనకదుర్గ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఎంఈఓ ఏవీఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పీఎంసీ చైర్మన్ గర్లంకి పెంటయ్యదొర (బాబ్జి)నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వాకదారిపేట కేజీబీవీకి చెందిన విద్యార్థిని జస్మితాదేవి 524 మార్కులు సాధించడంతో కాకినాడ జేఎన్‌టీయూల్లో ప్రత్యేకంగా అభినందించి, నగదు ప్రోత్సాహం అందించినట్టు కేజీబీవీ ప్రత్యేకాధికారి రాజేశ్వరి తెలిపారు.